ప్రతిపక్షాల కుట్రతో పింఛనుదార్లకు కష్టాలు

సర్వత్రా ఆందోళన


పింఛన్ కోసం కేంద్రం వద్ద వేచి ఉన్న వృద్ధులు (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: ప్రతిపక్ష పార్టీల కుట్రతో ప్రతినెలా 1వ తేదీ తెల్లవారకముందే అందే పింఛన్ సొమ్ము ఈ నెల అందకపోవడంతో లబ్ధిదారులైన అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి, సర్వర్లు పనిచేయక నానా కష్టాలు పడేవారు. వారి కష్టాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో తొలగించారు. వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇంటి తలుపులు తట్టి మరీ పింఛన్ సొమ్ము అందించేలా చర్యలు చేపట్టారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇలా లబ్ధిదారులు అందరికీ సూర్యోదయం రాకుండానే చేతికి పింఛన్ సొమ్ము అందేది. వృద్ధులు ఇంటి నుంచి బయటకు వచ్చే పనిలేకుండా వలంటీర్ వచ్చి పథకాల లబ్ధి అందించేవారు. ఒకవేళ వేలిముద్రలు పడకపోతే వలంటీర్ వేలిముద్ర వేసి పింఛన్ లేదా రేషన్ బియ్యం అందించేవారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకం లబ్ధి అయినా అర్హుల ఇంటికే వలంటీర్ తెచ్చి ఇచ్చేవారు. దూరప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, వైద్యం కోసం గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, వైజాగ్ వంటి ప్రాంతాల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకే వలంటీర్లు వెళ్లి పింఛను సొమ్ము అందజేసేవారు. తాజాగా ప్రతిపక్షాల కుట్రలతో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు వలంటీర్ వ్యవస్థ దూరమై పింఛన్ లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ నెల సచివాలయాల వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో వికలాంగులు, మంచంపై నుంచి లేవలేని వృద్ధులు, ఇతర ప్రాంతాల్లో వైద్యం పొందుతోన్న వారూ ఆందోళనకు గురవుతున్నారు. నియోజవకర్గంలోని పాలకొల్లు పట్టణంలో 6,041, పాలకొల్లు మండలంలో 8,680, యలమంచిలి మండలంలో 10,886 మంది కలిపి 25,607 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో సుమారు 3 వేల వరకు వికలాంగులు, నడవలేని వృద్ధులే ఉన్నారు.

నడవలేకపోతున్నాను..



కొంతకాలంగా ఆరోగ్యం సహకరించక నడవలేకపోతున్నాను. వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తోంది. ఇంటికి వచ్చి ఇస్తున్నారేమిటి అని అడిగితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇంటికి వెళ్లే పింఛన్ అందించాలని సూచించారని మా వలంటీర్ లావణ్య చెప్పింది. ఇప్పుడు పింఛన్ సొమ్ము ఇంటికి రాదని వలంటీర్ అంటున్నారు. నాకు భర్త, పిల్లలు లేరు. మా తమ్ముడి ఇంట్లో ఉంటున్నాను. నేను నడవలేను మోటార్ సైకిల్‌పై కూడా కూర్చొని వెళ్లలేను. మరి నాకు పింఛన్ ఎలా వస్తుందో అర్థం కావడంలేదు.

– పి.రామలక్ష్మి, వృద్ధురాలు, పాలకొల్లు

వలంటీర్లు దేవుళ్లతో సమానం



వేలి ముద్రలు, ఐరీష్ పడక నాకు చాలా కాలం పింఛన్ రాలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్‌కు నా సమస్య తెలియజేస్తే సచివాలయం అధికారులు ఇంటికి వచ్చి నా సమస్యను తెలుసుకున్నారు. నా సమస్య తెలిపిన కొద్ది రోజుల్లోనే నాకు పింఛన్ అందించారు. నాకు సమస్య పరిష్కారానికి కృషి చేసిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు దేవుళ్లతో సమానం. రేషన్ బియ్యం తీసుకునే సమయంలో వేలిముద్రలు పడకపోతే వలంటీరే వేలి ముద్ర వేసి నాకు బియ్యం ఇప్పించేవారు. ఇప్పుడు సచివాలయం వద్దకెళ్లాలి అంటున్నారు. అంతదూరం నేను వెళ్లలేను కళ్లు కనిపించవు, ఇప్పుడు వలంటీర్ రాకపోతే నాకు పింఛన్, రేషన్ ఎలా వస్తుంది.

– అంజమ్మ, వికలాంగురాలు , పాలకొల్లు

'చంద్రబాబుకు పింఛన్‌దారుల ఉసురు తగులుతుంది'


పెదపాటి పెద్దిరాజు

పోడూరు: లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయకుండా తన జేబు సంస్థ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, అడ్డుకున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు అవ్వతాతలు, వికలాంగులు, వితంతువుల ఉసురు తగులుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు అన్నారు. సోమవారం ఆయన అప్పన్నచెరువులో తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. వలంటీర్ వ్యవస్థతో జగన్ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తోన్న విశేష ఆదరణ చూసి టీడీపీ అధినేత చంద్రబాబు మొదటినుంచీ వలంటీర్లపై కక్షకట్టారని చెప్పారు. ప్రతినెలా 1వ తేదీ తెల్లవారకముందే లబ్ధిదారులైన అవ్వతాతలు, వికలాంగులు, వితంతువుల ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛను సొమ్ము ఇస్తున్నారని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా ఇంట్లోంచి కదలలేని వృద్ధులు, వికలాంగులు, పనులు మానుకుని ఆఫీసులు చుట్టూ తిరగలేని వితంతువులకు ఎంతో మేలు చేకూరుతోందని వివరించారు. వలంటీర్లను పింఛను ఇవ్వకుండా అడ్డుకోవడం వల్ల అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులు టీడీపీని ఓడించి గట్టి గుణపాఠం చెబుతారని పెద్దిరాజు పేర్కొన్నారు.

వలంటీర్లపై కక్ష సాధింపు తగదు


కర్రి అనురాధ జోగిరెడ్డి

పెనుమంట్ర: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ వృద్ధులు, వికలాంగులకు సేవలు అందిస్తోన్న వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం తగదని ఆచంట నియోజకవర్గ వలంటీర్ల కన్వీనర్ కర్రి అనురాధ జోగిరెడ్డి అన్నారు. సోమవారం ఆమె మార్టేరులో విలేకర్లతో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా వలంటీర్ వ్యవస్థలో అనేక మంది పనిచేస్తున్నారని, వారిపై కక్షకట్టి చంద్రబాబు అనుచరులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం, కోర్టులకు వెళ్లడం వల్ల, 1వ తేదీ తెల్లవారు జామునే పింఛన్ సొమ్ము అందుకునే వృద్ధులు, వికలాంగులు సోమవారం పింఛన్ చేతికి రాక ఆందోళనకు గురౌతున్నారని చెప్పారు. పింఛన్ పంపిణీని ఇంటికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు.

వలంటీర్ల సేవలు అమోఘం


కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: కరోనా కష్ట కాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన వలంటీర్లను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు దారుణమైన వ్యాఖ్యలు చేస్తూ వారి విధులను నిలుపుదల చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. మహిళలను అక్రమంగా రవాణా చేస్తున్నారని పవన్ కల్యాణ్ అసభ్యంగా మాట్లాడారని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన అవ్వాతాతలకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లను విధుల నుంచి నిలుపుదల చేస్తూ ఈసీకి ఫిర్యాదులు చేయడం సరికాదన్నారు. రానున్న కాలంలో ఈ కూటమి నేతలకు వలంటీర్లే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విధులను అడ్డుకోవడం దారుణం


మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: వలంటీర్ల విధులను అడ్డుకోవడం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు తగదని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు అన్నారు. పూలపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్లు వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్ అందించి వారి అభిమానానికి పాత్రులయ్యేవారన్నారు. ఎన్నికల కమిషన్‌కి నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఫిర్యాదు చేయించి వలంటీర్ల విధులను అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు వయోభారంతో బాధపడుతున్న అవ్వాతాతల ఉసురు తగులుతుందన్నారు. సీఎం జగన్ రెండోసారి అధికారం చేపట్టడం ఖాయమని తేలిపోయిందన్నారు. చంద్రబాబు అండ్‌కో సీఎం జగన్ చరిష్మాని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. 65 లక్షల మంది లబ్ధిదారులను నిరుత్సాహపరచిన ఘనత ప్రతిపక్షాలకు దక్కుతుందన్నారు.

గడపగడపకూ సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు


మొగల్తూరు: చింతరేవులో వేంద్ర వెంకటస్వామితో కలిసి ప్రచారం చేస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు


మొగల్తూరు: వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రసాదరాజు


మొగల్తూరు: చిన్నారిని ముద్దాడుతున్న ప్రసాదరాజు

మొగల్తూరు: రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామం చింతరేవు ప్రాంతంలో సోమవారం ఉదయం ప్రసాదరాజు తన తనయుడు శ్రీకృష్ణంరాజు, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వేంద్ర వెంకటస్వామితో కలిసి ప్రజాశ్వీరాద ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ముత్యాలపల్లి గ్రామంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. తాగునీటి సమస్య లేకుండా ఇప్పటికే చింతరేవు, ముత్యాలపల్లి, గెదళ్లవంపు ప్రాంతాల్లో పైప్‌లైన్‌లు, కుళాయిలు ఏర్పాటుచేశామని, మిగిలిన ప్రాంతాల్లోనూ త్వరలో పనులు పూర్తిచేస్తామని చెప్పారు. మండలంలో ఏ గ్రామంలో లేనివిధంగా నాడు నేడు పథకంలో ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేశామని, జూనియర్ కాలేజీ మంజూరు చేశామని వివరించారు. ఓదార్పు యాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముత్యాలపల్లి గ్రామంలోనే రాత్రి బస చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో నరసాపురం మున్సిపల్ చైర్మన్ బర్రి వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఏఎంసీ చైర్మన్ గుత్తుల రాధాకృష్ణ, ఆంధ్రాజు చల్లారావు, ఎంపీటీసీ సభ్యులు లింగం ఏసుబాబు, మంతెన పాండు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి ఏసుబాబు, రేవు రాంబాబు, సరిపల్లి సుబ్బరాజు, బర్రి సామెరు, కొల్లాటి గంగాచలం, రామాని మహేష్, కొప్పాడ గున్నయ్య, రేవు నారాయణ మూర్తి, దొంగ నాగముని, తణుకుల వెంకన్న, కవురు పెద్దిరాజు, తన్నీడి గిరి, వేగి బాబి, జక్కంశెట్టి ఏడుకొండలు, కవురు సుబ్రహ్మణ్యం, ఆంజనేయరాజు, పడవల సత్యనారాయణ, అనంత సుబ్రహ్మణ్యం, ఆకన దొరబాబు, కొల్లాబత్తుల రాంపండు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దు

పెనుమంట్ర: చంద్రబాబు బూటకపు వాగ్దానాలు, మాయమాటలు నమ్మి టీడీపీకి ఓటేస్తే భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు పేదలు దరిచేరవని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆయన పెనుమంట్రలో ఎన్నికల ప్రచార శంఖారావ పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేశారని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే జగన్ లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల మేలు చేకూరిందని అనుకుంటేనే ఫ్యానుగుర్తుపై ఓట్లేసి తనతోపాటు పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను కూడా గెలిపించాలని, జగన్‌మోహన్ రెడ్డిని రెండోసారి సీఎం కావడానికి కృషి చేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు నాగమోహనరాజారెడ్డి, ఎస్సీ, బీసీ, మైనార్టీ, రజక, నాయీబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

పాలకొల్లు అర్బన్: గడపగడపకూ సంక్షేమ పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు మండలం వాలమర్రులో సోమవారం గుడాల గోపి, మంగతాయారు దంపతులు, వారి కుమారుడు సాయి బాలాజీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నవరత్న పథకాల కరపత్రం అందించి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలు, అసెంబ్లీ అభ్యర్థి అయిన తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గుడాల గోపి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందన్నారు. సీఎం జగన్ పాలన మెచ్చి వైఎస్సార్ సీపీని స్వాగతిస్తున్నారని చెప్పారు. 10 ఏళ్ల నుంచి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డ్రామాలు తప్ప ప్రజలు మెచ్చే విధంగా అభివృద్ధి చేయలేకపోయారని ఆరోపించారు. వాలమర్రులో గోపికి మహిళలు హారతులు పట్టి నీరాజనాలు పలికారు. గుడాల గోపి, మంగతాయారు దంపతులను శాలువాలతో సత్కరించారు. చేనేత కార్మికుల కుటుంబాలు గోపి, మంగతాయారు, సాయిబాలాజీల మెడలో నూలు దండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వాలమర్రు దళితవాడలో యువజనులు, దళిత పెద్దలు పెద్దసంఖ్యలో పాల్గొని వారికి స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, గ్రామ సర్పంచ్ గంటా సత్యనారాయణ, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, ఉపసర్పంచ్ దాసరి రమేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గంటా గణపతిరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేంద్ర సింహాచలం, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, మండల గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్‌రాజు, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు, గ్రామ నాయకులు నార్ని వీరాంజనేయులు, రుద్రరాజు మురళీకృష్ణవర్మ, సరెళ్ల బంగారయ్య, సరెళ్ల సుబ్బారావు, సరెళ్ల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు అర్బన్ : వాలమర్రులో గోపి, శేషుబాబులకు హారతి పడుతున్న మహిళలు


పెనుమంట్ర : వృద్ధురాలితో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


పెనుమంట్ర : పెద చెరువుగట్టున ఓటర్లకు అభివాదం చేస్తున్న శ్రీరంగనాథరాజు

ఎంపీపీ వెంకటరమణ రాజీనామా


జెడ్పీ సీఈఓ సుబ్బారావుకు రాజీనామా పత్రం అందిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

యలమంచిలి: యలమంచిలి మండల పరిషత్ అధ్యక్షురాలు రావూరి వెంకటరమణ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సోమవారం ఏలూరు వెళ్లి జిల్లా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావుకు అందజేశారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల సమయంలో జరిగిన ఒప్పందంలో భాగంగా ఆమె రాజీనామా చేశారు. ఆ సమయంలో వెంకటరమణకు, ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మికి చెరో రెండున్నరేళ్లు ఎంపీపీగా చేయాలని ఒప్పందం చేసుకున్నారు. ఎవరు ముందు ఎంపీపీ అనే విషయంలో టాస్ వేయగా వెంకటరమణకు మొదటి అవకాశం వచ్చింది. ఆ గడువు మార్చి నెలతో ముగియడంతో ఆమె రాజీనామా చేశారు.

వలంటీర్ల రాజీనామా


మార్టేరులో గ్రామ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో పలువురు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ సొంత పనులు చేసుకుంటున్నా కొన్నిపత్రికలు, రాజకీయ నాయకులు తమపై వ్యక్తిగత నిఘాతో వేధిస్తున్నారని, తమను స్వేచ్ఛగా తిరగనివ్వని కారణంగానే రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు పేర్కొన్నారు. మార్టేరు గ్రామానికి చెందిన డీజీ శేఖర్‌రెడ్డి, మేడపాటి సాయి, భోగేశ్వరరెడ్డి, స్టీఫెన్ జూబ్లీ, వెలగలేరుకు చెందిన కె.కిశోర్, కల్యాణ చక్రవర్తి అనే వలంటీర్లు తమ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శులకు సోమవారం అందజేశారు.

'పెయింటర్స్, వర్కర్స్ సమస్యలు పరిష్కరిస్తా'


గోపికి పుష్పంగుచ్ఛం అందిస్తున్న పెయింటర్స్

పాలకొల్లు అర్బన్: మీ కష్టం నాకు తెలుసు, నేను మీలో ఒకడ్ని నన్ను ఆశీర్వదించండి మీ సమస్యలను అతి త్వరలోనే పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని పెయింటర్స్ అసోసియేషన్, మొబైల్ రిపేర్ వర్కర్స్ యూనియన్ సమావేశాల్లో సోమవారం గుడాల గోపి పాల్గొని ఓట్లు అభ్యర్థించి వారి మద్దతు కోరారు. వృత్తిలో నిబద్ధత పాటించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించి తనకు పాలకొల్లు ఎమ్మెల్యే టికెట్ కేటాయించారని చెప్పారు. పెయింటర్స్ అసోసియేషన్ నాయకులు నీలం రవి, వల్లూరి రామబ్రహ్మం, సమతం చంద్రరావు, బొప్పె సాంబమూర్తి, తాళ్ల బాలసుబ్రహ్మణ్యం, ఎస్‌కేడీ బాబ్జి, కోరుకొండ సుబ్బారావు, పెనుమాళ్ల వెంకటరమణారెడ్డి, వల్లూరి దుర్గాప్రసాద్, గొల్ల సత్తిబాబు, వబిలిరెడ్డి సూర్యనారాయణ, మొబైల్ రిపేర్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాజేటి రాజా, వీవీ వర్మరాజు, పి కిరణ్‌కుమార్, ఎం నాగభూషణం, డి సంతోష్, కె రవికృష్ణ తదితరులు గుడాల గోపిని శాలువాతో సత్కరించి అభినందించారు.


మొబైల్ రిపేర్ వర్కర్స్‌తో గోపి

నేడు గోపి ఎన్నికల ప్రచారం ఇలా..

పాలకొల్లు అర్బన్ / యలమంచిలి: వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మంగళవారం ఉదయం 8 గంటలకు పాలకొల్లు యడ్లబజార్ సెంటర్ 11వ వార్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజ చేసి అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, సచివాలయాల కన్వీనర్ మోర్త గిరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం నుంచి యలమంచిలి మండలం నారినమెరక గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరింది.

క్లుప్తంగా

చెరువులను పూర్తిస్థాయిలో నింపాలి


కాజతూర్పులో చెరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సత్యనారాయణ

యలమంచిలి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని నరసాపురం డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ అన్నారు. చించినాడ, ఊటాడ, యలమంచిలి, కాజ తూర్పు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. కాలువలు కట్టేసే సమయానికి చెరువుల్లో కనీసం 40 శాతం నీరు ఉండేలా ఇప్పుడే చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి చెరువులకు వంతు ఇచ్చిన సమయంలో పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. పైపులైన్, కుళాయి లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. డీఎల్‌పీఓ వెంట ఈఓపీఆర్డీ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు పాలా శారద శ్రీనివాస్, మాదాసు హరిప్రసాద్, కిషోర్ తదితరులున్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


పోడూరులో పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుహాసిని

పోడూరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగినచర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.సుహాసిని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. పోడూరు, జిన్నూరు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు, ఫిల్టర్‌బెడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, జమ్ము బేబీ మహాలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎం.బలరామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బుజ్జేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు వి.రాంబాబు, పి.రవి ఉన్నారు.

పేరుపాలెంలో పోలీసుల కవాతు


పేరుపాలెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

మొగల్తూరు : ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో మనోధైర్యం నింపేందుకే కవాతు నిర్వహిస్తున్నామని సీఐ కె.గోవింద్‌రాజు అన్నారు. సోమవారం మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని అంగజాలపాలెం, తెన్నేటిపేట, కవురువారిపాలెం తదితర ప్రాంతాల్లో సీఐఎస్‌ఎఫ్, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జర్నాల్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రామాన్ జీ, మొగల్తూరు ఎస్సై కె.వెంకట రమణ, తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై చంద్రబాబు ద్వేషం


దిద్దే శ్రీనివాస్

పోడూరు: టిప్పర్ డ్రైవర్‌కు సీఎం జగన్ అసెంబ్లీ సీటివ్వడంతో రాయలసీమ ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు దళితులు, మాదిగలపై చంద్రబాబు మరోసారి ద్వేషం చూపించారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దిద్దే శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను బట్టి మాదిగలు డ్రైవర్లుగా కూడా పనికిరారా అని ప్రశ్నించారు. విద్యావంతుడైన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులకు సీఎం జగన్ వైఎస్సార్ సీపీ తరపున సింగనమల సీటు ఇచ్చారని తెలిపారు. దళితుడైన టిప్పర్ డ్రైవర్‌ను చంద్రబాబు హీనంగా చూస్తే సీఎం జగనన్న అసెంబ్లీలో కూర్చోబెట్టేందుకు సీటిచ్చి దళితులు, మాదిగల పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించారని వివరించారు. ఓట్ల కోసం మాదిగలను వాడుకుని అధికారంలోకి వచ్చాక మాదిగలను అణగదొక్కిన చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. వీరాంజనేయులను ఉద్దేశించి టిప్పర్ డ్రైవర్‌కు సీటిచ్చాడని హేళన చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను మందకృష్ణ మాదిగ ఎందుకు ఖండించలేదని, ఎందుకు స్పందించలేదని శ్రీనివాస్ ప్రశ్నించారు. మాదిగలను హీనంగా చూస్తున్న చంద్రబాబు కూటమికి మద్దతు ఉపసంహరించుకోవాలని మందకృష్ణ మాదిగను డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కూటమిని ఓడించి బుద్ధి చెప్పడానికి మాదిగలంతా సిద్ధంగా ఉండాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.